క్లుప్తంగా

ఆస్పత్రి ఏర్పాటుకు విజ్ఞప్తి

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన బాకీ జాన్



వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన జాన్

తుక్కుగూడ: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహాను తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాకీ జాన్ శనివారం నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్య పరంగా మరిన్ని మెరుగైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



శివసాయినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ, తదితర ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కనీస వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు మాధవరెడ్డి, గంగాధర్, రమేశ్‌గుప్తా, ఏఈ హేమూనాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాలక వర్గ సభ్యులు

వనస్థలిపురం: సచివాలయనగర్‌లోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం (2024)నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం ఆలయ పాలక కమిటీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆలయ గౌరవ చైర్మన్ రంగినేని వెంకటేశ్వర్‌రావు, చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ, భక్తుల కోసం ఆలయంలో నిత్య హోమం, నిత్య కల్యాణం, నిత్య అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించేందుకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు ఆర్.జగదీశ్‌కుమార్, బీవీ పాపారావు, కె.సత్తయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కోశాధికారి కె.శ్రీధర్, సంయుక్త కార్యదర్శి పి.శ్యామల, సహాయ కోశాధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బాసటగా ఉంటాం

నాగోలు: పేదలకు నిరంతరం ఉప్పల ఫౌండేషన్ చేయూత నందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సిద్దిపేటకు చెందిన పేద యువతి బడిగే భవాని వివాహం సందర్భంగా శనివారం ఉప్పల శ్రీనివాస్ గుప్తాను నాగోలులోని ఆయన స్వగృహంలో కలిశారు. భవానికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులు, పండ్లు, పెళ్లికి 100 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ తాము పేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రజిత టీఆర్ఎస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఇది చెత్తబుట్ట కాదు..!



హయత్‌నగర్: ప్రజలు ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన విన్నపాలు, దరఖాస్తులపై అధికారులు ఎంత శ్రద్ధ వహిస్తున్నారో ఈ చిత్రం అద్దం పడుతోంది. వివిధ పథకాల కోసం, ధ్రువ పత్రాల కోసం ప్రజలు ఇచ్చిన అర్జీలను.. ఇలా ఇష్టానుసారంగా పడేశారు. చెత్తబుట్టను తలపిస్తున్న ఇది హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో దస్తావేజులను భద్రపరిచే గది. ఇక్కడ కాగితాలను ఇలా చెల్లా చెదురుగా పడేశారు.

మీటర్ రీడింగ్‌కు యాప్

- ఫోన్‌తో విద్యుత్ వినియోగం లెక్కింపు
- 'సాస'తో మరింత సులభతరం
- తీరనున్న సిబ్బంది కష్టాలు

మహేశ్వరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికత వైపు విద్యుత్ శాఖ సైతం అడుగులు వేస్తుంది. ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లతో విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం ఇప్పటికే అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఫోన్‌తో మీటర్‌ను స్కాన్ చేయటం ద్వారా రీడింగ్ తీసే విధానాన్ని రూపొందించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ విధానం అమలు చేస్తున్నారు.

గతంలో హెచ్చుతగ్గులు..

గతంలో ఇంటింటికీ విద్యుత్ సిబ్బంది తిరిగి మీటర్ రీడింగ్ పుస్తకంలో రాసుకుని వారం తర్వాత వినియోగదారుడికి బిల్లు ఇచ్చేవారు. ఈ విధానం వినియోగదారులకు, సంస్థకు ప్రయోజనకరంగా లేకపోవడంతో స్పాట్ బిల్లింగ్ యంత్రాలను ప్రవేశపెట్టి ఇంటి వద్దే బిల్లు తీసి ఇచ్చేవారు. ఇందులో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. యంత్రంలో బిల్లు నమోదైన అనంతరం దాన్ని కంప్యూటర్‌కు అనుసంధానించి సర్వర్‌లో అప్‌లోడ్ చేసేవారు. దీనికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టేది. అప్‌లోడ్ సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని సర్వీసులకు సంబంధించి బిల్లులు హెచ్చుతగ్గులు నమోదు కావటం, ఇతర సమస్యలు ఉత్పన్నమయ్యేవి. యంత్రాలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి రీడింగ్‌కు సిబ్బంది రాని పరిస్థితి ఉంటుంది.

ప్రస్తుతం పారదర్శకంగా..

విద్యుత్ సిబ్బంది ఉపయోగించే ఫోన్‌తోనే విద్యుత్ మీటర్ రీడింగ్‌ను చూసేందుకు 'సాస' యాప్‌ను రూపొందించారు. ఉద్యోగికి యూజర్ ఐడీతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్ కేటాయించారు. ఫోన్‌లో నమోదైన రీడింగ్ ప్రింటింగ్ తీయడానికి ప్రత్యేక యంత్రాన్ని సమకూర్చనున్నారు. మీటర్ వద్దకు ఫోన్ తీసుకెళ్లగానే మీటర్ రీడింగ్ నమోదవుతుంది. అదే సమయంలో ఫొటో తీస్తుంది. వెనువెంటనే బిల్లు మొత్తం ప్రింటర్ నుంచి చీట్టి(బిల్లు) రూపంలో వస్తుంది. ఫోన్ ద్వారా నేరుగా విద్యుత్ సంస్థ సర్వర్‌కు కనెక్టు అయి అప్‌లోడ్ అవుతుంది. ఇదంతా కేవలం నిమిషం వ్యవధిలో జరుగుతోంది.

సాస యాప్ లోగో



ఫోన్ ద్వారా మీటర్ రీడింగ్ లెక్కిస్తున్న విద్యుత్ సిబ్బంది

యాప్‌తో రీడింగ్



సాస యాప్ సహాయంతో ఫోన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ తెలుసుకొని బిల్లులు చెల్లించే విధానం డివిజన్, మండలల్లో అమలు చేస్తున్నాం. ఈ విధానం సౌకర్యవంతంగా ఉండడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. మా సిబ్బంది సాస యాప్ ద్వారా మీటర్ రీడింగ్ చెక్ చేసి వినియోగదారుడి నుంచి బిల్లులు తీసుకొని వెంటనే అప్‌డేట్ అవుతుంది. ఎలాంటి హెచ్చుతగ్గులు, తప్పులు ఉండవు. సిబ్బందికి పని తొందరగా పూర్తయి, సమయం సైతం ఆదా అవుతుంది.

– చక్రపాణి, ఏఈ విద్యుత్, మహేశ్వరం

క్రీడలతో మానసికోల్లాసం

ఇండోర్ స్టేడియంలో నానో మై క్లాస్ రూమ్ స్పోర్ట్స్ మీట్

హుడాకాంప్లెక్స్: కొత్తపేట నానో మై క్లాస్ హోమ్ జూనియర్ కాలేజీ స్పోర్ట్స్ మీట్ శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మైక్లాస్ రూమ్ డైరెక్టర్ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ వెంకట రమణారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహద పడతాయని అన్నారు. అధునాతన సాంకేతికతతో విద్య అందిస్తున్నామని, నానో మైక్లాస్ రూమ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తా..

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రల్లో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎన్నిక సమయంలో వచ్చిన వినతి ప్రతాలను శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, ఇంకా మిగిలి ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలోని పలు కాలనీల్లో గతంలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లతో సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 90 శాతం మంచి నీటి సౌకర్యం కల్పించామని, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో త్వరలో మౌలిక సదుపాయాలు కలిపిస్తామన్నారు. ఎల్‌బీనగర్ అభివృద్ధే తన లక్ష్యమని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని ఆయన కోరారు.



ఎన్నికల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రోడ్డుకు అడ్డంగా పైపులు



ఆర్ఆర్ హోమ్స్ కాలనీలో పైపులతో మూసివేసిన రహదారి

- రహదారి మూసివేతతో వాహనదారుల అవస్థలు
- నెల రోజులుగా ఇదే తంతు

మీర్‌పేట: రోడ్డుకు అడ్డంగా పైపులు వేయడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆర్ఆర్‌హోమ్స్ మీదుగా కర్మన్‌ఘట్ ప్రధాన రహదారికి నిత్యం వాహనదారులు ప్రయాణిస్తుంటారు. నెల రోజులుగా రహదారిపై భారీ పైపులు వేసి పూర్తిగా మూసి వేయడంతో వాహన చోదకులు వెనక్కి వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. అక్కడ రోడ్డు మరమ్మతులు తదితర అభివృద్ధి పనులు జరగకపోయినా ఇష్టం వచ్చినట్లు మార్గాన్ని మూసివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రహదారిని నిర్బంధించి ఇబ్బందులు కలిగేలా పైపులు వేసిన వారిపై చర్యలు తీసుకుని రాకపోకలు సాగేలా చూడాలని వాహనదారులు కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

కుందుకూరులో ఆటో కార్మికుల రాస్తారోకో

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేయడంతో తాము ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని శనివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలు పట్టించుకోవాలన్నారు. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న ఆటో కార్మికులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అశనిపాతం కలిగిస్తోందన్నారు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు రూ.పది వేలు పరిహారంతో పాటు ప్రమాద బీమా కల్పించాలని, బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉదయ్‌ముదిరాజ్, మహేందర్, రాజు, అశోక్, వెంకటేష్, పాండు, శ్రీకాంత్, ప్రదీప్, అప్సర్ బాబు, యాదయ్య, శేఖర్, నరసింహా, రవీందర్, పవన్, రాజ్‌కుమార్, శంకర్, హైమాద్, బాల్‌రాజు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

బాలల పరిరక్షణపై అవగాహన

కందుకూరు: బాలల పరిరక్షణ బాధ్యత అందరిపైన ఉందని రాచులూరు సర్పంచ్ పి.శ్రీనివాస్‌చారి సూచించారు. శనివారం మండల పరిధిలోని రాచులూరు ప్రభుత్వ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ జిల్లా నిర్వాహకుడు కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. బాలలపై వేధింపులు, అకృత్యాలు, హింస జరగకుండా చూడాలన్నారు. బాలలకు ఎదురయ్యే సమస్యలు గుర్తించి పరిష్కరించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ యాదయ్య, శోభ, ఆశా కార్యకర్తలు సంతోష, సరిత, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, యాదమ్మ, గ్రామస్తులు యాదయ్య, నరేష్, లక్ష్మణ్, హైమావతి, ప్రమీల, అండాలు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న కమిటీ సభ్యులు

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైంది

వనస్థలిపురం: వనస్థలిపురంలోని మమత స్కూల్ ఆఫ్ నర్సింగ్ 25వ బ్యాచ్, నిమ్షి స్కూల్ ఆఫ్ నర్సింగ్ 12వ బ్యాచ్ లాంప్ లైటింగ్ సెర్మనీ అండ్ క్యాపింగ్ సెర్మనీని శుక్రవారం రాత్రి స్థానిక క్రాంతిహిల్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి డా.బి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆపదలో ఉన్న రోగులకు చికిత్స సమయంలో సేవలు అందించడంలో నర్సుల పాత్ర ఎనలేనిదని అన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ కోర్సులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మెటర్నిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.రజినీఆనందరాజ్, నర్సింగ్ కళాశాలల ఫౌండర్ అండ్ కరస్పాండెంట్ టీఎస్ బాబూరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డులోని మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి కాలనీలో మహాత్మా జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, మండల పార్టీ కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను ప్రజలకు తెలిజేసేందుకే విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్, శేఖర్, పుల్లయ్య, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం స్వామి వారికి అభిషేకం, తులసీదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప సర్పంచ్ తిరుపతి శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోవాలని కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- పౌష్టికాహారంతో మేలు
- పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: నేటితరం యువతకు అందించే ఆస్తులు ఏవైనా ఉన్నాయంటే అది ఆరోగ్యమే అని త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన మాస్టర్ చెఫ్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చిన్నారులు వారి తల్లిదండ్రుల సహాయంతో పౌష్టిక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమతుల ఆహారం తీసుకుంటే ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని తెలిపారు. పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే చిన్నారుల ఎదుగుదల, మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సమాజానికి ఆరోగ్యవంతమైన యువత ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం న్యాయనిర్ణేతల పర్యవేక్షణలో చిన్నారుల పోటీని విజయవంతంగా ముగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్, ప్రధానోపాధ్యాయులు యోగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆహార ప్రదర్శనలో గోవర్ధన్‌రెడ్డి

మద్యం షాపును తొలగించాలని ఆందోళన



జైపురికాలనీలోని మద్యం షాపు ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని జైపురి కాలనీతో పాటు పరిసర ప్రాంత కాలనీల మహిళలు శనివారం మద్యం షాపు ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జైపురికాలనీ, నువ్వులబండ, బ్లెండ్స్ కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జైపురికాలనీలో పరిసర ప్రాంత కాలనీలో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని, మద్యం దుకాణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జైపురికాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జ్ఞానబోధనతో మార్గదర్శకులుగా నిలవాలి



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

సైదాబాద్: కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తమ జ్ఞానబోధన ద్వారా మార్గదర్శకులుగా నిలవాలని మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు సూచించారు. శనివారం సైదాబాద్ డివిజన్ మాతృశ్రీ కాలనీలోని కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. పూర్వ విద్యార్థులు కళాశాలలో తమకు ఉన్న జ్ఞాపకాలను ఒకరితో ఒకరు గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు మాట్లాడుతూ, కళాశాల పూర్వ విద్యార్థులు కొందరు వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం అభినందనీయమన్నారు. తమ విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరడం విద్య నేర్పిన గురువులకు ఆనందదాయకంగా ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా కళాశాల మ్యూజిక్ క్లబ్ సభ్యులు ప్రదర్శించిన మ్యూజిక్ కన్సర్ట్ అందరినీ అలరించింది. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేపీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జె.సుధాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఆమనగల్లు: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమితో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కుంగిపోవద్దని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, చంద్రశేఖర్‌రెడ్డి, సతీశ్, గుత్తి బాలస్వామి, సైదులు, ప్రసాద్, కిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మహాపడి పూజకు హాజరు

మాడ్గుల: మండలం కొలుకులపల్లి గ్రామంలో వెంకటేశ్‌స్వామి నివాసంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనతో గ్రామం మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్‌రెడ్డిని వెంకటేశ్ స్వామిని ఘనంగా సత్కరించారు.

హనుమాన్ ఆలయంలో కసిరెడ్డి పూజలు



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కసిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలోనే కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నారాయణరెడ్డిని ఆశీర్వదించారు. పూజా కార్యక్రమాల్లో మాడ్గుల జెడ్పీటీసీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కొల్కులపల్లి సర్పంచ్ అనురాధ, ఖానాపూర్ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.